
ప్రజాశక్తి
శనివారం 26 ఆగస్టు 2023
5
కర్నూలు



డిఎస్‌సి-98 అభ్యర్థుల భిక్షాటన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డిఎస్‌సి 98 క్వాలిఫైడ్ అభ్యర్థులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో భిక్షాటన చేపడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బాధిత 98 డిఎస్‌సి పోస్టుల సాధన సమితి నాయకులు హైమావతి దేవి, తిరుమల నాయుడు, మల్లేష్ రమేష్‌లో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ డిఎస్‌సి 98 అభ్యర్థులతో ఆటలాడడం తగదన్నారు. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న తమకు న్యాయం చేస్తానని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి మాట తప్పారన్నారు. డిఎస్‌సి 98 క్వాలిఫైడ్ అభ్యర్థులందరికీ జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని భవిష్యత్తులో మరింత ఉధృతంగా చేపడుతామని వారు హెచ్చరించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


భిక్షాటన చేస్తున్న అభ్యర్థులు

31లోపు భవన నిర్మాణాలు పూర్తి కావాలి

- గడువులోపు నాడు - నేడు పనులు - కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఈనెల 31 లోపు రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఇంజనీర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, హౌసింగ్, మన బడి-నాడు తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ బేస్ మెంట్ స్థాయికి పైన ఉన్న 183 రైతు భరోసా కేంద్రాలు, 179 విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు ఈనెల 31 లోపు పూర్తయ్యే విధంగా ప్రణాళికా బద్ధంగా పని చేయాలని కలెక్టర్ పంచాయతీరాజ్ ఇంజనీర్ లను ఆదేశించారు. ఫ్లోరింగ్, ఎలక్ట్రిక్, పెయింటింగ్, ప్లంబింగ్ తదితర పనులకు సంబంధించి రూపొందించుకున్న ప్రణాళికను సంబంధిత మండలాల ఎంపిడిఒలకు ఇచ్చి, ప్రతి రోజు ప్రణాళిక ప్రకారమే పనులు జరిగే విధంగా చూసుకోవాలని పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్లను, ఎంపిడిఒ లను ఆదేశించారు. సెప్టెంబర్ 15 నాటికి 240 సచివాలయ భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. భవన నిర్మాణంలో ఏవైనా స్థానికంగా సమస్యలు ఉన్నా, సిమెంట్, స్టీల్, ఇసుక కొరత ఉన్నా తన దష్టికి తీసుకొని వస్తే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భవన నిర్మాణాల్లో జాప్యం జరగకుండా ఏజెన్సీలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని, లేబర్ తక్కువ ఉన్న చోట లేబర్‌ను మరింత పెంచి పనులలో పురోగతి సాధించాలని అధికారులకు సూచించారు. పెండింగులో ఉన్న మైనర్, మేజర్ మరమ్మతులు, టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్, టాయిలెట్స్‌కు డోర్స్, ఎలక్ట్రిఫికేషన్, తాగు నీరు, కిచెన్ షెడ్స్ పనులు ఈనెల 31 నాటికి పూర్తి చేసేలా ఎపిఇడబ్ల్యుఐడిసి, సమగ్ర శిక్ష అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ పాఠశాలలో అయినా ఫర్నిచర్ లేకపోతే అవసరమైన ఇండెంట్లు పెట్టి పాఠశాలలో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఎంఇఒల పై ఉందన్నారు. మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి అన్ని వసతులు ఏర్పాటు చేసి ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూలు)గా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో కు సంబంధించి 5-18 సంవత్సరాల మధ్య ఉన్న ప్రతి పిల్లవాడిని పాఠశాలలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాలంటీర్ల లాగిన్ లో ఉన్న వివరాలను అప్డేట్ చేసి మెయిన్ స్ట్రీమ్ చేయాలన్నారు. 10వ తరగతి, ఇంటర్ లో ఫెయిల్ అయిన విద్యార్థులను మరల తిరిగి పాఠశాలల్లో, కళాశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వారికి అమ్మ ఒడి పథకం వస్తుందనే విషయాన్ని తెలియచేయాలని, ఒక వేళ వారు చేరకపోతే ఓపెన్ స్కూల్ లోనైనా చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓపెన్ స్కూలులో చేర్పించడంతో పాటు నైపుణ్య శిక్షణ కేంద్రాలకు వారిని అనుసంధానం చేయాలని ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్‌ను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 30న కాకినాడ జిల్లా సామర్లకోట నుండి నవరత్నాలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, ఆ రోజు జిల్లా స్థాయిలో ఓర్వకల్‌లో ఉన్న లేఅవుట్ ప్రారంభించుకుంటున్నామని, ఆ లేఅవుట్‌లో రోడ్లు, స్ట్రీట్ లైట్లు, ఎంట్రన్స్ ఆర్చి తదితర పనులన్నీ పూర్తి చేయాలన్నారు. కౌతాళం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, పత్తికొండ, ఓర్వకల్లు, వెల్దుర్తి, కోసిగి, కృష్ణగిరి, దేవనకొండ మండలాల్లో పెండింగులో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇనాగేశ్వరరావు, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, ఎస్ఎస్ఒ పిఒ డాక్టర్ కె.వేణుగోపాల్, డిఇఒ రంగారెడ్డి, హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జునుడు, హౌసింగ్ (ఇంఛార్జి) పిడి సిద్ధలింగమూర్తి, ఐసిడిఎస్ (ఇంఛార్జి) పిడి వెంకట లక్ష్మమ్మ సంబంధిత శాఖ అధికారులు, ఎంఇఒలు, సిడిపిఒలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

టీచర్ వైద్యం కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు పట్టణంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పేటలో సెకండరి గ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎ. నాగలక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమెకు ఫ్యాప్టో సంఘాల తరపున రూ 3.50 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి చేతులమీదుగా ఆమెకు అందజేశారు. జిల్లా చైర్మెన్, సెక్రెటరీ జనరల్ ఎస్.గోకారి, జి. తిమ్మప్పలు మాట్లాడుతూ ఆపదలో చేసిన సహాయం చిన్నదైనా కొండంత అండగా ఉంటుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు జిల్లా శాఖ ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. ఇందులకు బాధితురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ కష్ట సమయంలో నాకు ఆర్థిక సహాయం చేసిన కర్నూలు జిల్లా ఫ్యాప్టో నాయకత్వానికి , జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. డిఇఒ కూడా రూ 5000 ఆర్థిక సాయం అందజేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. సురేష్ కుమార్, కె.ప్రకాశ్ రావు, హెచ్.తిమ్మన్న, జి.హృదయ రాజులకు విరాళాల సేకరణలో క్రియాశీలకంగా వ్యవహరించిన దేవప్రసన్నరాజు, నారాయణ స్వామిలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో,జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు టికె. జనార్ధన్, ఎస్ఎం. జయారాజు ,ఎం.రంగన్న, రత్నం,ఏసేపు, నారాయణ, శ్రీనివాస యాదవ్, ఇస్మాయిల్, మరియానందమ్, భాస్కర్, సుధాకర్, సేవ్యా నాయక్‌లు పాల్గొన్నారు


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

టమోటా కొనుగోళ్లు ప్రారంభం

- గరిష్ట ధర కిలో రూ.22, కనిష్ట ధర రూ.10

ప్రజాశక్తి-పత్తికొండ

టమోట ఇటీవల కిలోకు రూ.120 దాటిన అనంతరం స్థానికంగా దిగుబడి అయ్యే టమోటా పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌కు చేరింది. టమోటా క్రయవిక్రయాలు శుక్రవారం ప్రారంభించినట్లు మార్కెట్ సెక్రెటరీ కార్నొలిస్ తెలిపారు. పత్తికొండ టమోటా మార్కెట్లో 100కిలోలకు గరిష్ట ధర రూ.2200 పలికింది. అంటే కిలో రూ.22, మధ్యంతర ధర రూ.1500 కిలోకు రూ.15, కనిష్ట ధర రూ.1000 కిలో రూ.10 పలికినట్లు తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 80 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. రైతులకు సకాలంలోనే డబ్బులు చెల్లించాలని సూచించారు. రైతులు టమోటాను తక్కువ ధరకు అమ్ముకోవద్దని అన్నారు. వ్యాపారస్తులు ఎవరైనా మోసాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. టమోటా మార్కెట్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


టమోటా కొనుగోళ్లను చేపడుతున్న సిబ్బంది

ముగ్గురు టిఎలు, నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెన్షన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల్లో భాగంగా కోడుమూరు మండలం పరిధిలో అవకతవకులకు పాల్పడిన ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు, నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెన్షన్ చేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు అధికారి అమర్నాథ్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ ఆయన వారిలో గోరంట్ల గ్రామానికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్ రవికుమార్ ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, ఆమడగుంట్ల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు ,ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్ పురుషోత్తం కుమార్, ఫీల్డ్ అసిస్టెంట జనార్ధన్, వెంకటగిరి గ్రామానికి చెందిన టిఎ. వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ గిడ్డమ్మలను విధుల నుండి తొలగించినట్లు వెల్లడించారు. మండల ఎపిఒ రమాదేవి, ఇసి వెంకటేశ్వర్లు, శివకాశికి నోటీసులను జారీ చేశారు.

ఎస్ఐ దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం

- పరుగు పోటీలను జెండా ఊపి ప్రారంభించిన డిఐజి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు శుక్రవారం నుండి కర్నూలు ఎస్‌ఎపి క్యాంపు 2 వ బెటాలియన్ లో దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. కర్నూలు రేంజ్ డిఐజి ఎస్.సెంథిల్ కుమార్, జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు. డిఐజి మీడియాతో మాట్లాడుతూ...ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ రోజు నుండి ఫిజికల్ మెజర్ మెంట్, ఫిజికల్ ఎఫిషియన్స్ టెస్టులు ప్రారంభమయ్యాయన్నారు. రాయలసీమ రేంజ్ పరిదిలో 16, 108 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. అందులో 14,011 మంది పురుషులు, 2,097 మంది మహిళ అభ్యర్థులు ఉన్నారన్నారు. ప్రతి రోజు 8 వందల మంది అభ్యర్థులు దేహ దారుఢ్య పరీక్షలలో పాల్గొంటారని, పోలీసు రిక్రూట్ మెంట్ బోర్డు ఆదేశాను సారం నిర్వహిస్తున్నామన్నారు. రోజూ ఉదయం 5 గంటల నుండి దేహదారుఢ్యల పరీక్షల ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. అన్ని ఏర్పాట్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ప్రతి రోజు అభ్యర్థులకు మొదటగా సర్టిఫికెట్స్ పరిశీలన చేస్తారన్నారు. ఎత్తు,చాతీ వంటి ఫిజికల్ మెజర్ మెంట్స్ చేస్తారు. తర్వాత బయోమెట్రిక్ తీసుకుంటారన్నారు. దేహదారుఢ్య పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 12 నుండి 3 గంటల వరకు విరామ సమయం ఉంటుందని చెప్పారు. దేహ దారుఢ్య పరీక్షల దగ్గర ఎక్కడ కూడా ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావు లేకుండా ఆధునిక ఆర్ఎఫ్ఐడి కంప్యూటరైజ్డ్ టెక్నాలజితో పకడ్బందీ ఏర్పాట్లు చేసామని తెలిపారు. డిజిటల్ గా, పారదర్శకంగా ఈ వెంట్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 20 వరకు ఈ వెంట్స్ జరుగుతాయని పేర్కొన్నారు. సమస్యల పై అప్పీల్ చేసుకునే వారు రిక్విజేసేన్ రాసి ఇచ్చి , సర్టిఫికెట్ వెరిఫికెషన్ లో ఏదైనా లోపాలు ఉంటే సెప్టెంబర్ 21న అప్పీలుకు రావాలని తెలిపారు. రాయలసీమ రేంజ్ పరిధిలో కర్నూలు జిల్లా ఎస్‌పి , ఇతర జిల్లాల ఎస్‌పిల సహకారంతో 300 మంది పోలీసు సిబ్బంది రోజు ఉదయం 4 గంటల నుండి దేహదారుఢ్యల ప్రక్రియ దగ్గర విధులు నిర్వహిస్తున్నారన్నారు. పరుగు పందెంలో పాల్గొనే అభ్యర్థులకు అత్యవసర పరిస్థితులలో ఏదైనా జరిగితే అంబులెన్స్, డాక్టర్స్ వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశా మన్నారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం ఖచ్చితంగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, లేటెస్ట్ కుల ధృవీకరణ సర్టిఫికెట్ , క్రిమిలేయర్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. ఎఆర్ అడిషనల్ ఎస్‌పి జి.నాగబాబు, డిస్‌పిలు, డిపిఒ ఎఒ సురేష్ బాబు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐ, ఆర్ఎస్ఐలు ఉన్నారు.


జెండా ఊపి పరుగు పోటీలను ప్రారంభిస్తున్న డిఐజి


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్‌ఖాన్

పేదల ఆర్థికాభివృద్ధి కోసం పథకాలు : హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

పేదల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే ఎంఎ.హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కర్నూలు 52వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బంది, స్థానిక వార్డు నాయకులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ మాట్లాడుతూ ఆర్థికాభివద్ధితోనే పేదల బతుకులు మారుతాయని చెప్పారు. ఈ ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి మేలు చేసేలా పథకాలు తీసుకొచ్చి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం చేసిన సేవలను సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు తాను వచ్చానని, రాజకీయాల కోసం తాను రాలేదన్నారు. ముఖ్యమంత్రి జగనన్నకు మరోసారి అవకాశం కల్పించి గెలిపించాలన్నారు. 52వ వార్డ్‌వైసిపి నాయకులు వార్డ్ ఇంచార్జి సర్దార్ మహేష్, రమణ, ఈబ్రు, మునిస్వామి, సుబ్బు, హనోక్, చిన్ని, సిద్దయ్య, గుణ శేఖర్, నరేష్, గుణ, రియాజ్, రిజవాన్, నాజిమా బేగం,బాల శివ, ఫ్రూట్‌చిన్న ,హరి, నాయబ్, ఫయాజ్, సోమశేఖర్, అశోక్ పార్టీ ముఖ్యనాయకులు, వార్డ్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి

ప్రజాశక్తి-తుగ్గలి

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు పరిశుభ్రతను పాటించాలని సచివాలయం ఆరోగ్య కార్యదర్శులు మహాలక్ష్మి, రోజా, శ్రీదేవి, రేఖ, పద్మావతి, అంజలి అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా తుగ్గలి, రాంపల్లి, మారెళ్ల, పగిడిరాయి, జొన్నగిరి తదితర గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్విహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి వారు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలన్నారు. పరిశుభ్రత పాటించకపోవడం వల్ల దోమలు ఇళ్లల్లోకి చేరి వివిధ రోగాలకు కారణమవుతున్నాయని అన్నారు. ఈ చిన్న జబ్బు వచ్చినా వెంటనే ఆరోగ్య కేంద్రానికి తరలించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఐదు రకాల అదనపు కరెంట్ చార్జీలు రద్దు చేయాలి

పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

'ఇంట్లో ఉండేది తక్కువే..ఒకే లైటు వాడుతున్నా..రెండింతలైన కరెంటు బిల్లు.ప్రైవేట్ మహిళా స్వీపర్ ' 'కరెంటు చార్జీలకు భయపడి బయట కూర్చొని బీడీలు తయారు చేస్తున్నా మహిళా కార్మికులు' అంటున్నారు. ఇలాంటి తరుణంలో పేదల ఇల్లు తట్టి పలుకరించింది పట్టణ పౌర సంక్షేమ సంఘం ...

పేద,మద్య తరగతి ప్రజల పై ఐదు రకాల అదనపు కరెంటు చార్జీల భారం రద్దు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ పుల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 10-12 గంటల ఇంటి బయటేఉంటున్నా...వాడేది ఒకటి రెండు కరెంటు లైట్లే అయినా కరెంటు బిల్లు రెండింతలు పెరిగిందన్నారు. పేదవాళ్లం ఎలా చెల్లించాలని, పేద కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. శుక్రవారం ఉదయం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం పాత నగరం లోని క్షత్రిబాగ్ ఏరియాలో పర్యటించిన సందర్భంగా బీడీ కార్మికులతో పాటు ఇతర పేద కార్మికులు పెరిగిన కరెంటు చార్జీల భారంపై వారి ఆవేదన విని చలించిపోయామని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. లైట్ వేసుకొని ఫ్యాన్ కింద కూర్చుంటే కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందని భయపడి ఇంటి బయట బీడీలు తయారు చేస్తున్నామని బీడీ కార్మికులు తెలిపారన్నారు. పగలంతా ఎక్కువ సమయం బయటనే ఉంటున్నామని ఇంట్లో ఉన్నప్పుడు ఒక లైటు మాత్రమే వాడుతున్నా కరెంటు బిల్లు రెండింతలు పెరిగిందని కాంట్రాక్టర్ కింద స్వీపర్ పనిచేసే రామలక్ష్మమ్మ అనే మహిళా కార్మికురాలు ప్రతినిధి బృందానికి తెలిపిందన్నారు. ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ ఎప్పుడో కొనుగోలు చేసిన కరెంటు ధర అడ్జెస్టుమెంట్ పేరుతో ఇప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలపై యూనిట్‌కు రూ. 40 పైసలు, ఎనర్జీ డ్యూటీ ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ఫిక్సుడు చార్జెస్, ట్రూఅప్ చార్జెస్, కస్టమర్ చార్జెస్ అంటూ ఇలా ఐదు రకాల కరెంటు చార్జీల భారం పేద మధ్యతరగతి ప్రజలపై వేయడం భావ్యం కాదన్నారు. వెంటనే రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే మరోసారి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ప్రతినిధి బృందంలో ఎస్.షాకీర్, ఎండి జావిద్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ బిల్లుల వివరాలు సేకరిస్తున్న ఇ.పుల్లారెడ్డి

మైపర్‌లో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని ఎ. క్యాంపులో గల మైపర్ ఫార్మసీ కళాశాలలో ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా జెఎన్‌టియు ఎఆర్ అండ్ డైరెక్టర్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ డెవలప్మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఈశ్వర్ రెడ్డి , మైపర్ ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొన్నారు. బి.ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ సహకారంతో తొలిసారిగా ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం మైపర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. మైపర్ కళాశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో చేయబోవు కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి కర్నూలు ట్రిపుల్ ఐటి డిఎం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.కృష్ణయ్య ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. చివరగా ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంకు హాజరైన వివిధ కళాశాలల అధ్యాపకులు మాట్లాడుతూ ఐదు రోజుల ప్రోగ్రాంలో వివిధ నూతన బోధనా పద్ధతుల గురించి తెలిపారు. మైపర్ కళాశాల యాజమాన్యానికి జెఎన్‌టియు యూనివర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. హాజరైన వివిధ కళాశాలల అధ్యాపకులకు చీఫ్ గెస్ట్ గా హాజరైన బి.ఈశ్వర్ రెడ్డి చేతులమీదుగా సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.రవికుమార్ రెడ్డి , వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్, అకాడమిక్ డీన్ ఎం.రాజ్ కుమార్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండల పరిధిలోని కొత్తపల్లె గుడిసెలలో రైతు షెడ్డును గుర్తుతెలియని వ్యక్తులు తగలపెట్టడంతో రు.15 లక్షల దాకా ఆస్తి నష్టం జరిగిందని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తపల్లె గుడిసెలకు చెందిన గిరిజన రైతు సుధాకర్ తమ తోటలో ఉన్న మల్బరీ షెడ్డు, ఇతరత్రా సామాగ్రి పూర్తిగా కాలిపోవడంతో తీవ్రంగా ఆస్తికి నష్టం జరిగిందన్నారు. దీంతో రైతు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

టిటిడి పాలకమండలి సభ్యునిగా సీతారామిరెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం



తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి కమిటీ సభ్యులుగా మంత్రాలయం మాజీ ఎంపిపి వై.సీతరామిరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం పాలకమండి పూర్తి కమిటీని ప్రకటించింది. వైసిపి నాయకులు, మంత్రాలయం మాజీ ఎపిపి,పెద్దాయన ఎమ్మిగనూర్ ఆర్‌టిసి డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వై.సీతారామిరెడ్డి పేరును కర్నూలు జిల్లా నుంచి ప్రకటించారు.

ఎస్‌డివి అజీజ్‌కు హంస పురస్కారం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్



తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు, సంస్కృత అకాడమి, ఆంధ్రప్రదేశ్ అందిస్తున్న హంస పురస్కారాలు-2023 రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. పురస్కారాల్లో కర్నూలుకు చెందిన ప్రసిద్ధ నవలాకారుడు, కథకుడు ఎస్‌డివి అజీజ్‌కు సాహిత్యరంగంలో చేసిన విశిష్టసేవలకు హంసపురస్కారం వరించింది. ఎస్‌డివి అజీజ్‌కు పురస్కారం ప్రకటించడం పట్ల సాహితీస్రవంతి నాయకులు ఆవులచక్రపాణియాదవ్ అయ్యన్న, ఆవులబసప్పలు హర్షం ప్రకటించారు. ఈ పురస్కారాన్ని ఈనెల 29న తెలుగు దినోత్సవం సందర్భంగా అందుకోనున్నారు.

రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి- కర్నూలు స్పోర్ట్స్



ఈ నెల 26,27 తేదీలలో ప్రకాశం జిల్లా చీమకుర్తిలో నిర్వహించారు. సిజు 5వ రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ పోటీలకు జిల్లా చెందిన 20 మంది క్రీడాకారులు పాల్గొనే జట్టు శుక్రవారం టిజి. భారత్ అభినందించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్ స్వగహంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కర్నూలు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి టిజి.భరత్ వచ్చి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులకు అభినందించారు. మన జిల్లాకు రాష్ట్రస్థాయి కరాటే పోటీలో పథకాలు సాధించాలని అన్నారు. అనంతరం క్రీడాకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాస్టర్స్ కె.క్రాంతికుమార్ , ఎస్.శ్రీనివాస్, మాస్టర్ టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొరవడిన నాణ్యత...

- బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు దుస్థితి
- అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?

ప్రజాశక్తి - ఆదోని

బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణంలో నాణ్యత కొరవడిందని పలువురు చర్చించుకుంటున్నారు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకు అప్పడే శిథిలావస్థకు చేరుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అప్పడెప్పడో బ్రిటీష్ కాలంలో నిర్మించిన రాంజల చెరువు చెక్కు చెదరలేదని పేర్కొంటున్నారు. నాణ్యత లోపం, అధికారుల నిర్లక్ష్యం వల్లే బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు శిథిలావస్థకు చేరిందని విమర్శిస్తున్నారు.

ఆదోని పట్టణ ప్రజలకు తాగునీరు అందించే ఏకైక వనరు బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు. ఈ ట్యాంకుకు ఈ దుస్థితి రావడానికి ప్రధాన కారణం ఎవరని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం రాంజలలో తాగునీరు నిండుగా ఉన్నా వాటిని వాడుకోరాదని నిపుణులు చెప్పడంతో గతేడాది నుంచి తాగునీటి కోసం వాడుకోవడం లేదు. పట్టణ ప్రజలు బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకుపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 20 ఏళ్ల క్రితం అప్పటి పాలకులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదోనిలో ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి భూసేకరణకు పూర్తి చేసేలోపు ప్రభుత్వం మారిపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హయాంలో ట్యాంకు నిర్మాణం జరిగింది. అప్పట్లోనే రూ.48 కోట్లతో ఈ ట్యాంకును నిర్మించారు. నిర్మాణ సమయంలోనే పనులు నాణ్యతగా జరగలేదని అప్పట్లోనే నిర్మాణంపై అనేక అపోహలు, విమర్శలు వచ్చాయి. 2005 ఎన్నికైన కౌన్సిల్ దీనిపై 2008లో ప్రత్యేక కమిటీని వేసిందని అప్పటి కౌన్సిలర్, టిడిపి నాయకులు రామచంద్ర తెలిపారు. ట్యాంకు నిర్మాణంలో పెద్దఎత్తున లోపం జరిగిందని, అందుకే ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మించిన ప్రాంతం నల్లరేగడి భూమి కావడం వల్ల నెరలు చాస్తుందని, నిర్మాణంలో కూడా అక్రమాలు జరిగాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక అడుగు సిసి లైనింగ్ వేయాల్సి ఉన్నా కేవలం 4 ఇంచుల సిసి లైనింగ్ మాత్రమే వేశారు. 15 ఏళ్లుగా ఎస్‌ఎస్ ట్యాంకు నిర్వహణ చూస్తున్న మున్సిపల్ అధికారులు దీనిపై పూర్తి శ్రద్ధ ఉంచలేదని, అందుకే ఈ దుస్థితి ఏర్పడిందని నిపుణులు పేర్కొంటున్నారు. నాలుగేళ్ల క్రితం ఎస్‌ఎస్ ట్యాంకు సిసి లైనింగ్ 100 మీటర్ల మేర కుంగిపోవడంతో అత్యవసరంగా రూ.60 లక్షల నిధులు మంజూరు చేసి పనులు చేపట్టారు. ఆ సిసి లైనింగ్ పనులు సక్రమంగా జరగలేదు. అవినీతి, అక్రమాలు జరగడం, రూ.40 లక్షల మేర బిల్లులు వచ్చినా పనులు నాణ్యతగా జరగలేదు. ఫలితంగా ఎస్‌ఎస్ ట్యాంకు లైనింగ్ మళ్లీ కుంగిపోయింది. మున్సిపల్ అధికారులు మరోమారు రాళ్లతో రివిట్‌మెంట్ కోసం రూ.1.80 కోట్లతో పనులకు టెండర్లు పిలిచి కడపకు చెందిన కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయించారు. రాళ్లతో చేపట్టిన రివిట్‌మెంట్ సైతం నేడు కుంగిపోయి మళ్లీ అదే దుస్థితికి చేరుకుంది. ఇప్పటివరకు ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ.2.40 కోట్ల నిధులు ఖర్చు చేసినా ఫలితం లేకుండాపోయింది. అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం, అవినీతి కారణంగా ఈ సమస్య ఏర్పడిందని, మూడేళ్ల నుంచి ఈ సమస్య ఉన్నా శాశ్వత పరిష్కారం ఎందుకు చూపలేకపోయారని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి, బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకును కాపాడేందుకు ప్రత్యేక చర్య లు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నీటి పంపింగ్ లేని వేసవిలో పనులెందుకు చేపట్టలేక పోయా రని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎస్‌ఎస్ ట్యాంకు నీటి పంపింగ్ కోసం ఎమ్మెల్యే భూమిపూజ చేసిన సమయంలో కూడా ఈ సమస్యపై ఎందుకు మాట్లాడలేదని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు.



కుంగిపోయిన చెరువు కట్ట

అధికారులను అప్రమత్తం చేస్తున్నాం

- శాంత మున్సిపల్ చైర్మన్



పట్టణంలో తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులను అప్రమత్తం చేస్తున్నాం. బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు మినహా నీటి నిల్వకు ప్రస్తుతం ఎలాంటి అవకాశమూ లేదు. రాంజల చెరువులో ఉన్న నీటిని బయటికి పంపి కాలువ నుంచి నీటి ప్రవాహం తగ్గకముందే అక్కడి నుంచి పంపింగ్ పనులకు శ్రీకారం చుట్టే విధంగా ఇప్పటికే చర్యలు చేపట్టారు. నీటి వృథాను కూడా అరికట్టే విధంగా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. తుంగభద్ర డ్యాంలో నీరు పుష్కలంగా ఉంది. తాగునీటికి ఇబ్బంది ఉండదు. ఎలాంటి అపోహలూ పెట్టుకోవద్దు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

- రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్



బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు బండ్ మరమ్మతుల కోసం ఇప్పటికే రూ.10 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం. సమస్యను ఉన్నతాధికారులకు వివరించి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ఎల్‌ఎల్‌సి కాలువలో నీటి ప్రవాహం ఉండడం వల్ల పంపింగ్ ద్వారా క్లోరినేషన్ చేసి నీటిని సరఫరా చేస్తున్నాం. చెరువు గట్టుకు పగుళ్ల ఏర్పడడంతో నీటి పంపింగ్ తగ్గించాం. రాంజల చెరువులోని నీటిని బయటికి పంపి పరిసరాలను శుభ్రం చేసి బసాపురం కాలువ నుంచి పంపింగ్ చేసి నీటి నిల్వ ఉంచుతాం. నీటిఎద్దడి రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకునే చర్యలపై స్పష్టత ఇవ్వాలి

- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి



ఆదోని పురవాసులకు తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు ఎలాంటి చర్యలు చేపడుతున్నారో స్పష్టం చేయాలి. ప్రస్తుతం ఎల్‌ఎల్‌సి కాలువ ద్వారా నీటిని నేరుగా మోటార్లతో పంపింగ్ చేసి ఓవర్‌హెడ్ ట్యాంకులకు నింపుతున్నారు. అనివార్య కారణాల వల్ల ఎల్‌ఎల్‌సికి నీటి ప్రవాహం తగ్గితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతోంది. ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతాం.

మానసికోల్లాసానికి క్రీడలు

- రూరల్ సిఐ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పోటీలను ప్రారంభిస్తున్న సిఐ మోహన్ రెడ్డి

శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలని రూరల్ సిఐ మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వీవర్స్ కాలనీ మైదానంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. రూరల్ సిఐ మోహన్ రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి, జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రస్తుతం చాలా ఒత్తిడికి గురవుతున్నారని, ఒత్తిడి నుంచి బయట పడేందుకు ఆటలు ఆడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ పరిస్థితి ఏర్పడటానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల ప్రభుత్వ విద్యారంగం కనుమరుగు అవుతోందని పేర్కొన్నారు. పేదపిల్లలను చదువుకు దూరం చేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని, ప్రభుత్వ విద్యారంగం ప్రయివేట్ పరం కాకుండా కాపాడుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న సురేష్ కుమార్

మొదటి మ్యాచ్ కోసిగి, పెద్దకడబూరు జట్ల మధ్య సాగింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి పెద్దకడబూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 139 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కోసిగి జట్టు 84 పరుగులు మాత్రమే చేసింది. యుటిఎఫ్ నాయకులు దావీద్, దేవపాల్, నరసింహులు, మల్లారి నాగరాజు, కౌలన్న, ఎం.రాజు, వై.రామాంజనేయులు, రవికుమార్, విజయ్ కుమార్, నల్లారెడ్డి, ప్రసాద్, జి.బాబు, చంద్రపాల్, పాపయ్య, భాస్కర్, శాంతిరాజు, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

కోశాధికారిగా ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి - దేవనకొండ

వైసిపి జిల్లా కోశాధికారిగా తెర్నేకల్ కొత్త కాపు మధుసూదన్ రెడ్డి ఎంపిక పట్ల తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, ఎంపిపి భర్త లుముంబా, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, ఉప సర్పంచి భర్త బెల్ ఈరన్న, నాయకులు చాప ఈరన్న, రాఘవేంద్ర హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడారు. వైసిపి అభివృద్ధికి చేస్తున్న కృషిని దృష్టిలో ఉంచుకొని ఆయనకు ఈ పదవి ఇచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్నీ ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

అర్హతే ప్రామాణికం.. ప్రజా సంక్షేమమే ధ్యేయం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి - హోళగుంద

అర్హతే ప్రామాణికంగా... ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని లింగంపల్లి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి గుమ్మనూరు జయరామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కల్వర్టులు, సిసి రోడ్లు, డ్రెయినేజీలు తదితర వాటికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. లింగంపల్లి గ్రామానికి ఇప్పటివరకు రూ.11.25 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, బట్టలు, బూట్లు, నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలో కొత్తగా రాజకీయ భిక్షగాళ్లు తయారయ్యారని, వారిని నమ్మొద్దని కోరారు. కులాభివృద్ధి కోసం ఏనాడూ పాటుపడని వారు ఇప్పుడు రాజకీయం చేయడం తగదన్నారు. నియోజకవర్గంలో అందరికీ సమాన న్యాయం చేశామని తెలిపారు. దేవరగట్టు ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, జడ్‌పి వైస్ చైర్మన్ బావ శేషప్ప, ఎంపిపి తనయుడు ఈసా, సొసైటీ చైర్మన్ మల్లి, మండల కన్వీనర్ షఫీవుల్లా, ఎంపిటిసి రత్నమ్మ, సర్పంచి భర్త విరుపాక్షి రెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి రామ్‌భీమ్ నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు అయ్యలప్ప, గ్రామ నాయకులు భీమారెడ్డి, కృష్ణప్ప, సీతారామిరెడ్డి, యువ నాయకులు మౌనిష్, శంభులింగ, ఈశ్వర్, వైసిపి తాలూకా నాయకులు ప్రకాష్ రెడ్డి, రామకృష్ణ, కుమార్ స్వామి పాల్గొన్నారు.



లబ్ధిపత్రాలను అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు

ఎడారిగా.. తుంగభద్ర..!

- కరుణరించని వరుణుడు
- ఎండిపోతున్న పంటలు
- రైతులకు కునుకు

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నది వర్షాకాలంలో జలాలతో పరవళ్లు తొక్కుతూ పరుగులు తీయాల్సిన రోజులు. ప్రస్తుతం నీరు లేక రాజస్థాన్ ఎడారిలా దర్శనమిస్తోంది. కొనసీమను తలపించే తుంగభద్ర నదీతీర గ్రామాల పంట పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయి. ఆనందంతో ఎరువులు వేయాల్సిన అన్నదాతల కళ్లల్లో కన్నీరు పారుతున్నాయి. వర్షాల్లేక సాగయిన పంటలు వాడిపోతున్నాయి. వ్యవసాయం కోసం రూ.వేలకు వేలు అప్పులు చేసి సాగు చేసిన అన్నదాతకు కంటి నిండా కునుకు లేకుండా ప్రకృతి కన్నెర్ర చేసింది. తుంగభద్ర నదీతీర రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇది...

కర్నూలు జిల్లాలో తుంగభద్ర నది జలాలు ప్రవేశించే ప్రాంతం కౌతాళం మండలం మేళిగనూరు గ్రామం. ఈ నది ఈ గ్రామం నుంచి నదీచాగి, కుంభాలనూర్, కుంభాలనూరు క్యాంపు, మురళి, గుడికంబాళి ద్వారా ప్రవాహం కొనసాగుతుంది. ఈ ప్రాంత రైతులు వరి పంటను సాగు చేశారు. ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. సుమారు 2 వేల ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేశారు. తుంగభద్ర నదిలో నీరు లేకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. అన్నదాత గుండె బాధతో బరువెక్కింది. వరుణుడైన కరుణిస్తాడా అనే బెంగతో ఎదురుచూస్తున్నారు. నెల రోజులవుతున్నా సరైన వర్షాలు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బోర్ల కింద సాగు

ఈ ప్రాంతంలో కొంతమంది రైతులు వ్యవసాయ బోర్ల కింద పంటలు సాగు చేశారు. ఈ రైతులకు విద్యుత్ కష్టాలు మొదలయ్యాయి. 9 గంటలు విద్యుత్ సరఫరా కావాల్సి ఉండగా కోతలతో రైతుకు కంటి నిండా నిద్ర లేకుండా చేస్తున్నారు. గంట గంటకు విద్యుత్ అంతరాయాలు ఏర్పడడంతో బోరు నీళ్లు ముందుకు వెళ్లక, భూమి తడవక, పంటలు ఎండిపోతున్నాయి. విద్యుత్ ఎప్పుడు వస్తుందో..? ఎంతసేపు వస్తుందో.. ఉంటుందో తెలియక అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



నీరులేక ఇసుక తేలిన నది

రైతులను ఆదుకోవాలి

- తెలుగు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్



తుంగభద్ర నది కింద సాగు చేసిన రైతులను ఆదుకోవాలి. తుంగభద్ర జలాశయం నుంచి తుంగభద్ర నదికి నీటిని వదిలి పంటలను కాపాడాలి. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించకపోతే రైతులు ఆర్థికంగా నష్టపోయి అప్పులపాలవుతారు.

మనస్తాపానికి గురై యువతి ఆత్మహత్య

- 17న ఆత్మహత్యాయత్నం - కోలుకోలేక మృతి

ప్రజాశక్తి - హోళగుంద



బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి కోలుకోలేక మృతి చెందారు. మండలంలోని లింగదహళ్లి గ్రామానికి చెందిన మాల మల్లికార్జున కుమార్తె గీత ఈనెల 17న మొదటి సంవత్సరం బీఎస్సీ నర్సింగ్‌లో ఫెయిల్ అయ్యానని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. చుట్టుపక్కల వారు గమనించి కాపాడారు. అప్పటికే ఒంటిపై బలమైన కాలిన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం బళ్లారి విమ్స్ ఆస్పత్రి (ఒపిడి)కి తరలించి చికిత్స అందించారు. కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యువతి తండ్రి మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హోళగుంద ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

జిఒ 142ను అమలు చేయాలి

- ఎంపిపికి సిఐటియు వినతి

ప్రజాశక్తి-ఆలూరు

ఎపి గ్రామ పంచాయతీ కార్మికుల జిఒ 142ను సక్రమంగా అమలు చేయాలని సిఐటియు నాయకులు కోరారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఎంపిపి రంగమ్మ, సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కెపి.నారాయణ స్వామి, షాకీర్ మాట్లాడారు. పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటూ చాలీచాలని వేతనాలతో కార్మికులు దుర్భర పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. జిఒ 142ను అమలు చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛను సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్‌సిని అమలు చేసి 1993 నాటికి ఉన్న కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. స్వచ్ఛభారత్ కార్మికులకు 13 నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎపి పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ తాలూకా కార్యదర్శి ఎల్లప్ప, రాముడు, లక్ష్మేంద్ర పాల్గొన్నారు.

టిపిఒకు అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పదోన్నతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులుకు అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. శుక్రవారం శ్రీనివాసులును పలువురు పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యాలయంలో ఉద్యోగులు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడారు. ఉద్యోగరీత్యా 2011లో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎమ్మిగనూరులో విధుల్లో చేరానని తెలిపారు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా 2015లో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పదోన్నతిపై బదిలీ అయ్యానని చెప్పారు. అక్కడి నుంచి 2018లో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొంది గుత్తిలో విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. అక్కడి నుంచి 2019 నుంచి ఆదోని టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. తనకు అసిస్టెంట్ సిటీ ప్లానర్, అడిషనల్ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించారన్నారు. అదే హోదాలోనే ఇక్కడ విధులు నిర్వర్తించాలని ప్రభుత్వము ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతి లేకుండా ఎవరూ ఇల్లు నిర్మించుకోరాదని తెలిపారు. ఆ దిశగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు ప్లానింగ్ ఇస్తూ ప్రభుత్వానికి ఆదాయం చేకూరేవిధంగా విధులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. తన విధుల్లో భాగంగా సహకరిస్తున్న ఉద్యోగులందరికీ ధన్యవాదాలు తెలిపారు.



నౌనప్ప మృతి పార్టీకి తీరని లోటు : టిడిపి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

టిడిపి సీనియర్ నాయకులు కురువ నౌనప్ప మృతి పార్టీకి తీరని లోటని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు తెలిపారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో కురువ నౌనప్ప స్వగృహానికి వెళ్లి ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళు లర్పించారు. నౌనప్ప కుమారుడు, నారాయణపురం మాజీ సర్పంచి కారుమంచప్పను ఓదార్చి, ధైర్యం చెప్పారు. వడ్డెమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, సాధిక్ వలీ, గిరిధర్, భరత్ ఉన్నారు.



ఆలూరు గెస్ట్‌హౌస్‌లో ఉన్న బొజ్జమ్మ, రామచంద్ర నాయుడు

శత్రువులున్న చోట ఉండలేం...

- అధిష్టానం ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ
- మాజీ జడ్‌పిటిసి బొజ్జమ్మ

ప్రజాశక్తి-ఆలూరు

వైసిపి అధిష్టానం ఆదేశిస్తే ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తామని ఆస్పరి మాజీ జడ్‌పిటిసి బొజ్జమ్మ తెలిపారు. శుక్రవారం బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు ఎల్లార్తి దర్గాను దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో ఆలూరు గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో వైసిపి అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రాణం ఉన్నంత వరకు పార్టీలోనే ఉంటామని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో తమ సేవలను గుర్తించలేదన్నారు. శత్రువులున్న చోట తాము ఉండలేమన్నారు. అభిమానులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తల అభీష్టం మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపి కండువా వేసుకున్నామని తెలిపారు. నియోజకవర్గ బాధ్యతలు చూసుకోమని ముఖ్యమంత్రి తెలిపారన్నారు. దేవనకొండలో వైసిపి కార్యక్రమంలో పాల్గొనడం లేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు తన తండ్రిని చంపిన వారితో ఎలా తిరుగుతామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు, పెద్దలు తమ ఇంటి ఆడపిల్లను ఆదరించి ఆశీస్సులు అందించాలని కోరారు.

అందరికీ సంక్షేమ పథకాలు

- వైసిపి రాష్ట్ర యువజన నాయకులు ప్రదీప్‌రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

వైసిపి ప్రభుత్వ హయాంలో అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైసిపి రాష్ట్ర యువజన నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కల్లుకుంట గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల వల్ల ప్రతి కుటుంబానికీ న్యాయం జరిగిందని తెలిపారు. సంక్షేమ పథకాలు అందని వారికి త్వరలోనే అందేటట్లు చూస్తామని హామీఇచ్చారు. నాయకులు రామ్మోహన్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిపి రఘురామ్, సర్పంచి ఇస్మాయిల్, మాజీ సర్పంచి సత్యనారాయణ, బాలముని, డీలర్ నర్సింగప్ప, కటిక మహ్మద్, విజయ్ కుమార్, షేర్ ఖాన్, అమీర్ ఖాన్ పాల్గొన్నారు.



ప్రదీప్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బిసివై పార్టీ ఆధ్వర్యంలో జాబ్ మేళా

ఆలూరు : భారత చైతన్య యువజన పార్టీ (బిసివై) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2, 3న మంగళగిరిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నాయకులు వరుణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆలూరు ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బిసివై పార్టీ పెట్టిన నెల రోజుల్లోనే పార్టీ అధినేత బి.రామచంద్ర యాదవ్ 600 కంపెనీల్లో 50 వేల మందికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబిఎ, ఎంసిఎ, బిటెక్ అర్హత గల నిరుద్యోగ యువత జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు. ఎంపికైన వారికి రూ.13 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు జీతం ఉంటుందని తెలిపారు. సెప్టెంబర్ 2, 3న విజయవాడ హ్యాపీ రిసార్ట్స్‌లో (డిజిపి ఆఫీస్ పక్కన, మంగళగిరి) ఉదయం 9 నుంచి 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, నిరుద్యగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు గౌతంకృష్ణ యాదవ్, వెంకట రాముడు యాదవ్, జెడి.రంగస్వామి, పక్కీర, చంద్రశేఖర్, రంగస్వామి, అక్బర్, బాలచంద్ర శేఖర్, రాము యాదవ్, మనోహర్ పాల్గొన్నారు.

మహిళలకు పెద్దపీట

- ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మహిళ ఆర్థికాభివృద్ధికి బాసటగా నిలుస్తూ, ప్రతి సంక్షేమ పథకాన్ని అందిస్తూ మహిళలకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూతను అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను పాఠశాలకు పంపి విద్యనందించాలనే సంకల్పంతో, నిరక్షరాస్యత నిర్మూలన దిశగా అమ్మఒడి ప్రవేశపెట్టినట్లు చెప్పారు. విద్యాదీవెన, వసతి దీవెన కింద 2516 మందికి రూ.251.6 లక్షలు, వైఎస్ఆర్ ఇబిసి నేస్తం కింద 195 మంది ఉన్నారని తెలిపారు. కాపు నేస్తం, వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద 9,515 మందికి రూ.2.68 లక్షలు ఇచ్చినట్లు చెప్పారు. వాహన మిత్ర కింద 292 మందికి రూ.29.2 లక్షలు, వైఎస్ఆర్ నేతన్న నేస్తం కింద రూ.333.12 లక్షలు వేస్తున్నట్లు తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ బిఆర్.బసిరెడ్డి, మెప్మా సభ్యులు భవాని, రత్నమ్మ, పార్వతి, విజయలక్ష్మి, గౌరమ్మ, పుష్ప, సునీత, జయలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

IN THE COURT OF THE II-ADDL. JUNIOR CIVIL JUDGE: ADONI.
O.S.No.330/2021

Between:
K.Raghavendra Rao. ...Plaintiff.
-V/s-
Bannuru Mabu Saheb. ...Defendant.

SUMMONS TO DEFENDANT

To
BANNURU MABU SAHEB, S/o.Bannuru Hussainappa, Shanthi Estate, Aspari Road, ADONI.

Whereas the above named Plaintiff filed the above suit against you for recovery of suit claim amount. You are hereby summoned to appear before this Hon'ble Court on 04.09.2023 at 10.30 A.M. either in person or through an Advocate to file any objection. If you fail to appear the case will be heard and decided ex-parte.

// BY ORDER OF THE COURT//
T.MALLIKARJUNA RAO,
ADVOCATE FOR PLAINTIFF, ADONI.

మహారాజ శ్రీ కర్నూలు 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం. 290/2019

యం సునీత. ...వాది
-Vs-
పురవాకిటి శ్రీనివాసరెడ్డి తండ్రి పి.క్రిష్ణరెడ్డి,వ్యాపారం, ఇంటి.నెం.4-22-10,బాలాజీనగర్, స్టాంటన్‌పురం గ్రామం, కర్నూలు (మం), కర్నూలు జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్సు

పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 12,31,920/-లు, ఇందులో రూ.8,70,000/-లపైన దావా దాఖలు చేసిన తేది నుండి 23% ప్రకారం వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసినది. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 01-9-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
యస్.చాంద్ బాష,
హెచ్.కె.జలంధర్,
వాది పరం అడ్వకేట్లు, కర్నూలు.

మహారాజ శ్రీ ఆదోని రెండవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
యం.వి.ఓ.పి.నెం.69/2022

బెస్త.పరమేష్ వగైరా. ...అర్జీదారు
-వర్సెస్-
వి.శ్రీరాములు వగైరా. ...రెస్పాండెంట్లు

3 రెస్పాండెంట్లకు నోటీసు

3.సుగాలి శంకర్‌నాయక్ తండ్రి సుగాలి సోమ్లానాయక్, నివాసం. మద్రిమాన్‌తాండగ్రామం, పత్తికొండ మండలం, కర్నూలు జిల్లా.

పై నెంబరులో యం.వి.ఓ.పి.లో అర్జీదారు 15-11-2021న రోడ్డు ప్రమాదములో జయప్ప అలియాస్ జయరాముడు చనిపోయినందున అతని వారసులకు నష్టపరిహారము రూ.10,00,000/-లు ప్రమాదము జరిగిన రోజు నుండి 18% ప్రకారము వడ్డీతో మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ పై కోర్టులో అర్జీదాఖలు చేసినారు. ఇందులో 3వ రెస్పాండెంటు అయిన మీకు 08-09-2023వ తేది పగలు 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేనియెడల మీపరోక్షమున పై అర్జీని విచారించి తీర్మానింపబడునని ఇందు మూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
ఇ.శ్రీనివాసరెడ్డి,
అర్జీదారు పరం అడ్వకేటు, కర్నూలు.

మహారాజ శ్రీ ఆదోని రెండవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
యం.వి.ఓ.పి.నెం.65/2022

దొడ్డు రాజు. ...అర్జీదారు
-వర్సెస్-
వి.శ్రీరాములు వగైరా. ...రెస్పాండెంట్లు

1,2,3 రెస్పాండెంట్లకు నోటీసు

1. వి.శ్రీరాములు తండ్రి వి.సంజన్న, ఇంటి.నెం.1-79-ఎ,ప్రాతకోట గ్రామం, పగిడ్యాల మండలం, కర్నూలుజిల్లా.
2. చోళమండలం యం/యస్ జనరల్ ఇన్సూరెన్స్ కో.లిమిటెడ్, రెప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజర్,ఆఫీస్ నెం.4-301-10, యం.ఆర్.బి.ట్రేడ్ సెంటర్, బంగారుపేట, రేల్వేస్టేషన్ రోడ్డు, కర్నూలు.
3. సుగాలి శంకర్‌నాయక్ తండ్రి సుగాలి సోమ్లానాయక్, నివాసం. మద్రిమాన్‌తాండగ్రామం, పత్తికొండ మండలం, కర్నూలు జిల్లా.

పై నెంబరులో యం.వి.ఓ.పి.లో అర్జీదారు 15-11-2021న రోడ్డు ప్రమాదములో తనకు జరిగిన గాయములకు నష్టపరిహారము రూ.5,00,000/-లు ప్రమాదము జరిగిన రోజు నుండి 18% ప్రకారము వడ్డీతో మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ అర్జీదాఖలు చేసినాడు. ఇందులో 1,2,3 రెస్పాండెంట్లు అయిన మీరు 29-08-2023వ తేది పగలు 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేనియెడల మీపరోక్షమున పై అర్జీని విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
ఇ.శ్రీనివాసరెడ్డి,
బి.రంగస్వామి,
అర్జీదారు పరం అడ్వకేట్లు కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం.506/2022 ఇన్ ఓ.యస్.నెం.491/2021

ముల్లా ఇద్దు మియ్యా పోతివారసులు
మూల్లా ఇదుర్స్‌బీ వగైరా. ...అర్జీదారులు
-ఎదురి-
శ్రీమతి మున్వర్ సుల్తానా భర్త నజీర్‌హమ్మద్, ఇంటి.నెం.44-40, రోజావీధి, ప్రకాష్‌నగర్, కర్నూలు. ...రెస్పాండెంటు

రెస్పాండెంటుకు ఆర్డర్ 22 రూలు 3 సి.పి.సి ఆర్/డబ్ల్యు రూలు 25 సివిల్ రూల్సు ప్రకారం నోటీసులు

పై నెంబరు దావాలో వాది అయిన ముల్లా ఇద్దుమియ్యా చనిపోయినందున అతనికి 1) ముల్లా ఇద్దుర్స్‌బీ 2) యస్.ఇద్రుస్, 3) యస్.అబ్దుల్ రఫీ, ఇంటి.నెం.3-109,గుటుపల్లి గ్రామం,బేతంచర్ల మండలం, కర్నూలు జిల్లా 4) సయ్యద్‌నజీమున్నీసా 5) సయ్యద్ హసీనాబీ, ఇంటి.నెం.129,కల్లుకుంట గ్రామము, పెద్దకడుబూరు మండలం,కర్నూలుజిల్లా వారసులమని దావాలో వారసులుగా చేర్చమని అర్జీదాఖలు చేసినారు. ఇందులో రెంస్పాండెంటు అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 17-10-2023 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపు కొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
సి.లోకేశ్వరయ్య,
సి.శాంతమూర్తి,
సి.పవన్‌కుమార్,
అర్జీదారుల పరం అడ్వకేట్లు, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో ఐ.పి.నెం.33/2022

యల్.వెంకటరామయ్య. ...అర్జీదారు
-వర్సెస్-
వై.దిశాగౌరి వగైరా. ...రెస్పాండెంట్లు

రెండవ రెస్పాండెంటుకు నోటీసు

జి.శ్రీలక్ష్మి అలియాస్ కె.నాగలక్ష్మీదేవి భర్త జి.పాండురంగ, ఇంటి.నెం.63-62,చిదంబరరావు వీధి, కర్నూలు సిటి.

పై నెంబరు ఐ.పిలో అర్జీదారు ఒకటవ రెస్పాండెంటును దివాళాదారుగా తీర్మానించమని కర్నూలు నాలుగవ అదనపు జిల్లా జడ్జి కోర్టు ఓ.యస్.నెం. 12/2022 దావాలో రూ.68,54,000/-లు వడ్డీతో సహ చెల్లించమని
2). 04-03-2022వ తేదిన 3,4,రెస్పాండెంట్ల పేర 1,2, రెస్పాండెంట్లు వ్రాయించి ఇచ్చిన దస్తావేజు నెం.4411/2022 ఈ మొత్తమునకు జవాబు దారీకాదని, సదరు దస్తావేజు చెల్లదని
3) అఫీషియల్ రిసీవర్‌ను అపాయింటు చేస్తూ షెడ్యూలు ఆస్తిని స్వాధీనం చేసుకొనమని అర్జీదాఖలు చేసినాడు. ఇందులో రెండవ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 27-9-2023వ తేది పగలు 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు అడ్వకేటు కాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీపరోక్షమున పై అర్జీని విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

షెడ్యూలు:

1.కర్నూలు జిల్లా కర్నూలు సబ్.డి చేరిన స్టాంటన్ పురం,కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా 91 వ వార్డు, ఇంటి.నెం.91/4-27-3-4-ఎ,1000 చ.అడుగులలో 500 లు చ.గజముల 1వ అంతస్తు.
చెక్కుబంది : తూర్పు : 30 అడుగులరోడ్డు, పడమర : ప్లాటు నం.35,36, ఉత్తరం :30 అడుగుల రోడ్డు, దక్షిణం :ప్లాటు నెం.39.
ఉత్తర-దక్షిణం : తూర్పు పక్క 72 అడుగులు,
ఉత్తర-దక్షిణం : పడమర పక్క 76 అడుగులు,
తూర్పు-పడమర : ఉత్తర పక్క 60 అడుగులు,
తూర్పు-పడమర :దక్షిణం దిశ 60 అడుగులు.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
సి.లోకేశ్వరయ్య,
సి.శాంతమూర్తి,
సి.పవన్‌కుమార్,
అర్జీదారుల పరం అడ్వకేట్లు, కర్నూలు.

తెలుగు గంగ గలగల..
పంటలు కలకల


తెలుగు గంగ 21 ఉపకార ద్వారా సమద్ధిగా పారుతున్న నీరు

ప్రజాశక్తి -రుద్రవరం

మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో కొన్ని రోజుల క్రితం వర్ష బావపరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఇటీవల తెలుగంగ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు పారుతూ ఉండడంతో పంటలు కళకళలా డుతున్నాయి. వ్యవసాయ పనులు ఊపు అందుకున్నాయి. రైతులు కూలీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వారం రోజుల క్రితం వరకు వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలు వాడు ముఖం పట్టాయి. ఇదే తరుణంలో ప్రభుత్వము వెలుగోడు బ్యాలెన్స్ రిజర్వాయర్ నుంచి తెలుగు గంగ ప్రధాన కాలువకు 2000 క్యూసెక్కుల నీరును విడుదల చేశారు. నీరు ప్రధాన కాలువల నుంచి ఉపకాల వరకు పారుతూ ఉండడంతో భూగర్భ జలాలుపెరిగి, సాగునీరు సమృద్ధిగా అందుతోంది. రైతులు కాలువలు బోరు బావులు, ఆయిల్ ఇంజన్లు, ద్వారా పంటలకు నీరును పారించుకుంటు పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో వాడు మొఖం పట్టిన పంటలు నేడు కళకళలాడుతున్నాయి. ఆయా పంటల్లో మంచి దిగుబడులు సాధించుకునేందుకు రైతులు రసాయనిక ఎరువులు జల్లుతు పురుగుల నివారణకు క్రిమిసంహారక మందులను పంటలపై పిచికారి చేసుకుంటున్నారు. మండలంలో ఖరీఫ్ సాగు కింద 25 వేల ఎకరాలలో పంటలు సాగు కావలసి ఉండగా ఏడాది 10 912 ఎకరాలలో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. రైతులు సాగుచేసిన వివిధ పంటల వివరాలు ఇలా ఉన్నాయి. వరి పంట 33 20 ఎకరాలు మొక్కజొన్న 56 90 ఎకరాలు,పత్తి 325 ఎకరాలు, మినుము 1282 ఎకరాలు, మిర్చి 25 ఎకరాలు, పసుపు 74 ఎకరాలు, పెసర 28 ఎకరాలు, ఇతరములు 234ఎకరాలు, మొత్తం ఇప్పటివరకు 10,912 పంటలు సాగు అయినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు.


నీరు పాడుతూ ఉండడంతో వరి నాట్లు వేసిన రైతులు


ఆయిల్ ఇంజన్ ద్వారా నీరుపాలించుకుంటున్న రైతులు


నాటు వేసేందుకు ట్రాక్టర్ ద్వారా వరినారు తీసుకెళుతున్న రైతులు


కళకళలాడుతున్న మొక్కజొన్న పంట

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - రుద్రవరం

ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ హెచ్చరించారు. మండల కేంద్రమైన రుద్రవరం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండవ గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులను తనిఖీ చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు సిబ్బంది ఎంతమంది పనిచేస్తున్నారు, తదితర వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. విధులకు హాజరు కాకుండా ఇష్టానుసారంగా రిజిస్టర్ నిర్వహిస్తుం డడంతో ఇలాగేనా విధులు నిర్వహించేది అని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రంలోని వార్డులు పరిశీలించి ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాధి కారులు ఉండగా విధులకు ఎందుకు హాజరు కాలేదని, వైద్యాధికారులు విధులకు హాజరు కాకుంటే ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించేది ఎలా అని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీపై ఆరోగ్య మిత్రను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే రెండవ గ్రామ సచివా లయాన్ని తనిఖీ చేసి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఆరాధిసి రికార్డులను తనిఖీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు సేవలు ప్రజలకు అందజేయాలన్నారు. సచివాల యం కొచ్చే ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని లేని, పక్షంలో సిబ్బందిపై చర్యలు తప్పవని సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. బడిబయటి పిల్లలను బడిలో చేర్పించడంలో నిర్లక్ష్యం చేయవద్దని గ్రామాలలో బడి బయట ఉన్న పిల్లలను బడిలో చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి అసిస్టెంట్లను హెచ్చరించారు. అనంతరం చంద లూరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. గ్రామస్తులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రజలకు ఇంటింటి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయరాదని వైద్య అధికారులకు సూచించారు. రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వైద్యాధికారులు ప్రజలకు హాజరుకాకపోవడంతో ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తే సహించేది లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట డిఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట రామయ్య, తహసిల్దార్ రవీంద్ర ప్రసాద్, ఎంపీడీవో మధుసూదన రెడ్డి, ఆయా శాఖల అధికారులు సిబ్బంది ఉన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

శ్రీశైలం నీటిమట్టం 856.20 అడుగులు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగుల నీటి నిలువ సామర్థ్యం 215.8070 టిఎంసిలు కాగా శుక్రవారం సాయంత్రం మూడు గంటల సమయానికి నీటి మట్టం 856.20 అడుగులుగా ఉంది. గత కొద్ది రోజులుగా ఎగువ ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి పూర్తిస్థాయిలో వరద నీటి ప్రవాహం నిలిచి పోయినప్పటికీ రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 7000 క్యూసె క్కులు, హంద్రీనీవా సుజలా స్రవంతికి 1898 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 2,400 క్యూసెక్కులు, ముచ్చుమర్రికి 490 క్యూసెక్కులు తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్తు ఉత్పత్తి వినియోగానికి 7000 క్యూసెక్కులు అలాగే జలాశయంలో ఆవిరి అయిన నీరు 320 క్యూసెక్కుల తో కలిపి మొత్తము 19,108 క్యూసెక్కుల నీరు బ్యాక్ వాటర్ విడుదల అవుతుంది. గడచిన 24 గంటలలో ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 2.2 08 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేశారు. అదే సమయానికి ప్రస్తుతం జలాశయం నందు నీటి నిలువ సామర్థ్యం 95.13 68 టీఎంసీలుగా నీరు నిలువగా ఉంది. అలాగే గతంలో ఇదే సమయానికి జలాశయం పూర్తిస్థాయిలో నిండుగా ఉండి రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా దిగువ సాగరకు నీటిని విడుదల చేశారు.

చంద్రయాన్-3తో పెరిగిన దేశ ఖ్యాతి

ప్రజాశక్తి - ఆత్మకూర్

చంద్రయాన్ 3 విక్రమ్ ల్యాండర్, చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా అడుగుపెట్టడంతో భారతదేశ ఖ్యాతి మరింత పెరిగిందని ఎస్సీ, ఎస్టీ, దళిత సంఘాలు, ప్రజా సంఘాలు ,విద్యార్థులు, హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం నాడు పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ముందు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు యేసు రత్నం, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చిలుక రాబిన్సన్ రాజు, మాల మహానాడు నియోజకవర్గ నాయకులు మురహరి మల్లయ్య, శీలం శేషు, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు జవహర్ నాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బి దర్గయ్య, తదితరులు పాల్గొని మాట్లాడారు. చంద్రయాన్ 3 విజయవంతంలో ఇద్దరు శాస్త్రజ్ఞులు ఆత్మకూరు వాసులు మానస, సింహాద్రి రాహుల్, ఉండడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లె ఎలీషా, భీమ్ అర్జున్, నాగయ్య, వర్ధన్ రాజు, దుద్యాల రమేష్, చింతలయ్య, రామారావు, రాజశేఖర్, బాలరాజు, చిన్న వెంకటరమణ, ప్రకాష్, శ్యామ్, సుధాకర్, నాని ,హైస్కూల్ సామాజిక సేవా కార్యకర్త అల్తాఫ్, హైస్కూల విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచెర్ల పట్టణం వాసి ముళ్ళ మీరం సాహెబ్, వహీదా దంపతుల కుమారుడు డాక్టర్ సలీం బాష చంద్రయాన్ 3 బృందంలో ఉండడం గర్వంగా ఉందని బేతంచెర్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్ సలీం బాష బేతంచర్ల పట్టణంలోని శ్రీ శేషారెడ్డి హైస్కూల్ నందు ప్రాథమిక విద్య పూర్తి చేసి సైంటిస్ట్‌గా ఎదగడం హర్షణీయం అన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద కేకులు కట్ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పంట నష్ట పరిహారం ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - మిడుతూరు

ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా రైతులు వేసిన అన్ని పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నాగలూటి గ్రామంలో ఎండిన మొక్కజొన్న పంటలను సిపిఎం నాయకులు కే భాస్కర్ రెడ్డి, పిపకీర్ సాహెబ్, టి గోపాలకృష్ణ, రైతులతో కలిసి ఎండిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురవడంతో రైతులు మొక్కజొన్న, కంది, తదితర పంటలు సాగు చేయడం జరిగిందని, ఇప్పుడు వర్షాలు కురవకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్న పాలకులు ,అధికారులు చూస్తూ ఉన్నారే తప్ప ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రైతులు అప్పులు చేసి ఎకరాకు రూ.50 వేల చొప్పున పెట్టుబడి ఎలా తీర్చాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. చుట్టూ ఉన్న నీరును ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న కనీసం ఒక తడి పెట్టుకోవడానికి నీరు ఇవ్వలేకపోతున్నారని వారు పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ఇచ్చి, రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు గోపాల్, మా బాష, శ్రీనివాసులు, తదితర రైతులు పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సిద్దాపురం చెరువుకు నీరు విడుదల

ప్రజాశక్తి - ఆత్మకూర్

వెలుగోడు రిజర్వాయర్ నుండి సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా శుక్రవారం నాడు సిద్దాపురం చెరువుకు శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి హౌస్ వద్ద బటన్ నొక్కి సిద్దాపురం చెరువుకు నీటిని విడుదల చేశారు. అనంతరం గంగమ్మ తల్లికి చీరసాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్ సంబంధించిన విద్యుత్ వైర్లు అక్కడక్కడ రైతులకు సాగునీరు అందించాలని తన సొంత డబ్బులు చెల్లించి వాటిని రిపేర్ చేయించడం జరిగిందన్నారు. నియోజవర్గంలో నిరంతరంగా పంటలకు విద్యుత్ అందించేందుకు అధికారులతో చర్చించడం జరిగిందని ఆయన సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు శివ శంకర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


బటన్ నొక్కి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే


జేసీతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజల ఆమోదంతోనే పరిశ్రమ స్థాపించాలి

ప్రజాశక్తి - మిడుతూరు

ప్రజల ఆమోదంతో పరిశ్రమలు స్థాపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శులు వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మిడుతూరు మండలం పై పాలెం గ్రామానికి వచ్చిన జేసీకి సిపిఎం బృందం నాగేశ్వరావు, భాస్కర్ రెడ్డి, పకీరు సాహెబ్, గోపాలకృష్ణ గ్రామస్తులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గ్రామంలో గ్రామ సభ జరిపి ప్రజల ఆమోదంతో పరిశ్రమలు స్థాపించాలని అంతవరకు పనులు చేపట్టకూడదని కోరారు. సోలార్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రజలకు తీవ్ర హాని కలుగుతోందని 2013 భూ సేకరణ చట్ట ప్రకారం 80% ప్రజల ఆమోదం పొందాలని, మార్కెట్ రేట్ కంటే నాలుగు అంతలు ధర నిర్ణయించాలని, ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలని, పైపాలెం గ్రామంలో 500 వేల గొర్రెలు, మేకలు ,2000 వేలు పశువులు కొండ ప్రాంతంలో 300 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నారని సోలార్ పరిశ్రమ స్థాపించడం వల్ల వారు జీవనోపాధి కోల్పోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రుడు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా బిపి మండల్ జయంతి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

బిపి మండల్ జయంతిని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమైక్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య కార్యాలయంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలతో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ యాదవ్, జిల్లా నాయకులు చల్లా సురేష్ బాబు, నక్క రాజేష్ నివాళులర్పించామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ అని, ఆయన ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ఆయన వర్ధంతి జయంతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సమాఖ్య నాయకులు కృష్ణ, మహేష్, మనోహర్, అనిల్, బాలు, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

బాల్య వివాహాలను అరికట్టాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి అన్నారు. పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్కె రమాదేవి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

14 నెలలుగా వేతనాలు రాకపోతే జీవనం ఎలా ?

ప్రజాశక్తి - ఆత్మకూరు

స్వచ్ఛభారత్ కార్మికులకు 14నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, స్వచ్ఛ భారత్ గ్రామీణ పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకులు స్వామి దాసు, వెంకటేశ్వర్లు, సుధాకర్, రవితేజలు అన్నారు. స్వచ్ఛ భారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం పట్టణలోని సుదర్శన వర్మ భవనం నుంచి బస్టాండ్ మీదుగా ఎంపీడీవో కార్యా లయం వరకు ర్యాలీ నిర్వహించి, ఎంపిడిఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు లేక కార్మికుల కుటుంబాలంతా ఆకలి కేకలతో రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రోజు గ్రామాలను శుభ్రం చేసే కార్మికులకు జీతాలు రాకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు. జీవో నెంబర్ 680 ప్రకారం రూ.10000 జీతం ఇస్తామన్న ప్రభుత్వం మూడు సంవత్సరాలయిన ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా పారిశుధ్య కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేయవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మా బాష, స్వచ్ఛభారత్ కార్మికులు వెంకటరాముడు, రామకష్ణ, లింగన్న, రాజశేఖర్, లక్ష్మయ్య, చిన్న రత్నమయ్య, ఏసన్న, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు 14 నెలలుగా జీతాలు రాకపోతే జీవనం ఎలా గడపాలని సిపిఎం మండల నాయకులు ఎన్ స్వాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొత్తపల్లిలో స్వచ్ఛభారత్ గ్రామీణ పారిశుధ్య కార్మికుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పారిశుధ్య కార్మికులు మల్లేష్, రంగస్వామి, జయన్న, ఓబులయ్య, చెన్నయ్య, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

అంతరాయం లేని విద్యుత్ ఇవ్వాలి : ఎఐకెఎస్

ప్రజాశక్తి - ఆత్మకూర్

విద్యుత్ సరఫరాలో కోతల వల్ల రైతులు సాగు చేసుకుంటున్న పంటలు ఎండిపోవుచుండడంతో రైతన్న తీవ్రంగా నష్టపోతున్నారనీ, ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించి ఆదుకోవా లని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షులు మా బాష, ప్రధాన కార్యదర్శి వీరన్న లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ విద్యుత్ అంతరాయంతో రైతంగం తీవ్రంగా నష్టపోతోందని, ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సరైన వర్షాలు పడకపోవడంతో పంటలు ఎండిపోతూ రైతులు అల్లాడుతుంటే.. మరోవైపు రైతులకు అందించే విద్యుత్ కోత లతో ఇబ్బందుల గురి చేయడంతో రైతులను ఆదుకోలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం సిగ్గు చేటని విమర్శించారు. మండల పరిధిలోని వేలాది ఎకరాలలో వర్షాధారంపై రైతుల పంటలు సాగు చేసుకుంటే మరి కొంతమంది రైతులు బోరు బావి కింద సాగు చేసుకునే పరిస్థితి ఉందన్నారు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసి రైతన్నలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రైతు సంఘం మండల అధ్యక్షుడు మా బాషా, వీరన్న

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రం దేవస్థానంలో శుక్రవారం వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతములను నిర్వహించారు. వెయ్యి మంది ముత్తైదులతో ఉత్తర ద్వారం ఎదురుగా ఉన్న చంద్రావతి కళ్యాణ మండపంలో సంప్రదాయబద్ధంగా వరలక్ష్మీ వ్రతమును నిర్వహించినట్లుగా దేవస్థానం కార్యనిర్వహణ అధికారి లవన్న తెలిపారు. అనంతరం వీరికి శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసి వీటితో పాటు శ్రీశైల ప్రభ పుస్తకాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసి స్వామి అమలు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న దంపతులు పాల్గొన్నారు. **మహానంది:** మహానంది పుణ్యక్షేత్రంలో అభిషేక మండపంలో ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. నంద్యాలకు చెందిన ఏ. జీ.ఎం.జ్యువెలర్స్ స్థాపకులు అవ్వారు గోపీనాథ్ దంపతుల సహకారంతో 500 మంది మహిళల చే పండితులు రవిశంకర్ పూజలు నిర్వహించారు. **బేతంచెర్ల :** వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసిం హస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని వైభవంగా నిర్వహిం చారు. ఈవో పాండురంగారెడ్డి చైర్మన్ రామచంద్రుడు, అర్చకులు మద్దిలేటి స్వామి కళ్యాణ్, పాలకమండలి మద్దయ్య మధు శేఖర్ పాల్గొన్నారు. **బనగానపల్లె :** మండలంలోని నందవరం గ్రామంలో శ్రీ చౌడేశ్వరి దేవి దేవస్థానంలో ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వ్రతం నిర్వహించారు. **పాములపాడు:** మండలంలో వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా చేసుకున్నారు. తుమ్మలూరు గ్రామంలో జెడ్పిటిసి సభ్యులు జ్యోతి రామలింగేశ్వర రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి వ్రతం నిర్వహించారు.



శ్రీశైలం : సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు, పాల్గొన్న ఇఒ లవన్న దంపతులు

చౌడేశ్వరి దేవస్థానంలో ..



సిపిఎం జిల్లా నాయకులు ఏం సుధాకర్

ప్రిజం పరిశ్రమ భూములు రైతులకు తిరిగి ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొలిమిగండ్ల

ప్రిజం సిమెంటు పరిశ్రమ కోసం భూములు ఇచ్చిన రైతులకు వారి భూమి తిరిగి ఇవ్వాలని సిపిఎం జిల్లా నాయకులు ఏం సుధాకర్ శుక్రవారం డిమాండ్ చేశారు. మండలంలోని కలవటాల,కోటపాడు గ్రామాల పరిధిలో ప్రిజం సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు కోసం రెండువేల ఎకరాల పైన భూమి కొనుగోలు చేసి నేటికీ ఏర్పాటు చేయలేదని, వెంటనే ఆ భూములు రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ యాజమాన్యం ఆ భూములను ఇతర పరిశ్రమలకు అమ్ముకునే ప్రయత్నం చేస్తోందని,అదే జరిగితే ఆ గ్రామాల భూములు కోల్పోయిన రైతులను పెద్ద ఎత్తున కదిరించి ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమ ంలో స్థానిక బాధిత రైతులు శ్రీకాంత్ రెడ్డి, నారపరెడ్డి,రామ్మోహన్ ,సుబ్బారెడ్డి ,కంబగిరి రాముడు, నాయకులు రమేషులు పాల్గొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ



బావిలోకి దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. అహోబిలం గ్రామానికి చెందిన పద్మావతి (37) దేవస్థానంలో స్వీపర్‌గా పనిచేస్తుంది. రోజువారి విధులలో భాగంగా విధులకు వెళ్లి డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చింది. మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి త్వరగా వస్తానని చెప్పి అహోబిలం మఠం వెనకాల ఉండే బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలిసిన వెంటనే బంధువులు ఆమెను 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి : ఎస్ఐ

ప్రజాశక్తి -ప్యాపిలి

వాహనాలకు డ్రైవింగ్ లైసెన్సు, రూట్ పరిమిట్లు తప్పనిసరిగా డ్రైవర్ వద్ద ఉండాలని ఎస్సై రాజకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం వాహనాల తనిఖీలో భాగంగా స్థానిక ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు పలు వాహనాల లైసెన్సు, పరిమిట్లను పరిశీలించారు. ఆటోలలో ఓవర్ లోడు వేసుకుని కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.


కర్నూల్ గుంటూరు రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

విద్యుత్ కోతలను నిరసిస్తూ ఆందోళన

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ శుక్రవారం ఆత్మకూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రైతులు, తెదేపా నాయకులు కర్నూల్ గుంటూరు రహదారిపై పెద్ద ఎత్తున ఆందోళనను నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల్లో మండలంలో పంటలు ఎండిపోతున్నాయని, బోర్లు, బావుల ద్వారా సాగు నీటి కోసం సరైన విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాతో దిగివచ్చిన విద్యుత్ శాఖ అధికారులు పగటి పూటనే విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల పక్షాన అండగా నిలిచిన శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, సాను కూలంగా స్పందించిన విద్యుత్ శాఖ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఫక్రుద్దీన్, శివప్రసాద్ రెడ్డి, మా బాష, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

గ్రామాలలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా మని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శిరివెళ్ల మండలం గోవింద పల్లె గ్రామంలో పర్యటించి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

నకిలీ మందులు అమ్మితే చర్యలు : ఎఒ

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని గాజులపల్లె గ్రామంలోని దీప్తి ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, గఫారియా పెస్టిసైడ్స్, ఎరువులు, పురుగు మందుల దుకాణా లలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి శుక్రవారం నాడు తనిఖీ చేశారు. అనుమతులు లేని రూ.ఒక్క లక్ష 11 వేల 245 విలువ చేసే రసాయనిక పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశరు. అనుమతులు లేని ఎరువులు, పురుగుమందులను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు మందులను కొనుగోలు చేసిన్నప్పుడు తప్పకుండా బిల్లులు తీసుకోవాలన్నారు.


తనిఖీలు చేస్తున్న దృశ్యం

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

నందికొట్కూరుకు చేరుకున్న విద్యార్థి సంగ్రామ బైక్ యాత్ర

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నంద్యాల జిల్లా విద్యారంగ అభివృద్ధికై చేపట్టిన ఈనెల23న డోన్‌లో ప్రారంభం అయిన విద్యార్థి సంగ్రామ బైక్ యాత్ర శుక్రవారం నందికొట్కూరుకు చేరుకుంది. నందికొట్కూరు పట్టణంలోని ఎస్ఎఫ్ఐ నాయకులు కొత్త బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డక్క.కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో జిల్లా కార్యదర్శి నిరంజన్, అధ్యక్షులు కుమార్, జిల్లా కోశాధికారి ఓబులేసు, జిల్లా సహాయ కార్యదర్శి మధు కిరణ్, ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించలేనంత దుర్భర పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్న ఒక్క అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయలేదని వారు మండి పడ్డారు. సంక్షేమ హాస్టల్లో నాడు–నేడు ద్వారా వసతులు ఏర్పాటు చేస్తామని చెబుతుంది తప్ప ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని తెలియజేశారు. సంక్షేమ హాస్టల్లో వర్షం పడితే గదులన్నీ కారుతున్నాయని, విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, దుస్తులు, దుప్పట్లు తడిసి ముద్దవుతున్నాయని, శిథిలావస్థ స్థితిలో ఉన్న సంక్షేమ హాస్టలను మరమ్మతులు కూడా చేయడం లేదని, అనేక ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు విద్యార్థులకు లేవని, పాఠశాల సమయంలో విద్యార్థుల వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీసం ఉపాధ్యాయులకు కూడా మరుగుదొడ్లు లేని స్థితిలో ప్రభుత్వ విద్యా సంస్థలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, ప్రతి నియోజకవర్గంలో మహిళా, డిగ్రీ కళాశాల , పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇంట్టిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు హరి వర్ధన్, శ్రీశైలం మండల అధ్యక్షుడు షేక్ వలి, నందికొట్కూరు మండల ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, రాము, చిన్నయ్య, అర్జున్, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


విరాళం అందజేస్తున్న దృశ్యం

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని కోటకందుకూరు గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయ నిర్మాణానికి బిజెపి తాలూకా ఇంచార్జ్ భూమా కిషోర్ రెడ్డి రూ.20 వేలు విరాళం అందజేశారు. శుక్రవారం కోట కందుకూరు గ్రామస్తులు భూమా కిషోర్ రెడ్డిని కలిసి వీరభద్ర స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరగా విరాళం అందజేశారు. ఈ సందర్భం గా గ్రామస్తులు కిషోర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చెంచు గూడేల్లో ఎంపిడిఒ సందర్శన

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని డి వనిపెంట చెంచుగూడాన్ని, చాగలమర్రి పట్టణ ంలోని చాగలమ్మ చెంచు కాలనీని ఎంపిడీఓ మహబూబ్ దౌలా శుక్రవారం సందర్శించారు. మౌలిక సదుపాయాల గురించి చెంచులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఈఓఆర్‌డి సుదర్శన్ రావు,పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్,సచివాలయ సిబ్బంది ఉన్నారు.


చెంచుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంపిడీఓ


మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే ఆర్థర్‌కు చౌడేశ్వరి దేవి ఆలయ అభివృద్ధి కమిటీ ధన్యవాదాలు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని కొణిదేల రోడ్డు ప్రక్కన ఉన్న తోగట వీర క్షత్రియ స్మశాన వాటికలో గురువారం రాత్రి శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ అభివృద్ధి కమిటీ అభ్యర్థన మేరకు బోరు వేయించి నీటి వసతిని కల్పించిన ఎమ్మెల్యే తోగురు ఆర్థర్‌కి 6వ వార్డు కౌన్సిలర్ దేశెట్టి సుమలత, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు శ్రీ కొప్పుల సత్యనారాయణ, శ్రీ చౌడేశ్వరి దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కోరుముట్ల రవీంద్రబాబు, ఉపాధ్యక్షులు దేశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి పాణ్యం వేణుగోపాల్, కోశాధికారి పూజారి బాబు, సభ్యులు జల్లు రామచంద్రుడు, ఎం కష్ణ, కొప్పుల వెంకటేష్, చింత ధనుంజయ, గుంపు శ్రీకాంత్, కుల బాంధవులు జల్లు శేషయ్య, డాలు శివకృష్ణ, దేశెట్టి శేషయ్య పాల్గొన్నారు.

తెలుగు భాషను మరవొద్దు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

దేశభాషలందు తెలుగు లెస్స అని ఎన్ని భాషలు నేర్చుకున్న తెలుగు భాషను మరువవద్దని ప్రిన్సిపాల్ శివరామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాష వారోత్సవాలలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, తదితర పోటీలు నిర్వహించారు. ఈనెల 29వ తేదీన గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంస పత్రాలు ఇస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు కల్లు హుస్సేనయ్య , అధ్యాపకులు కొండారెడ్డి, శిరీష భూదేవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూ హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - మిడుతూరు

వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం, తదితర అంశాలపై ఎంపిడిఓ, ఎంఆర్ఓ, ఈఓఆర్డిల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు.

భారతీ విద్యా మందిరంలో అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని భారతీ విద్యా మందిరం ఉన్నత పాఠశాలలో శుక్రవా రం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కమిటీ సభ్యులు టిఎంసి వేణుగోపాల్, నీలకంఠం, గోపాల్ రావు తదితరులు పాల్గొని చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. మూడు సంవత్సరాలు వయసు కలిగిన చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతి విద్యా మందిరాలు సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్ద పీట వేస్తున్నాయని కొనియాడారు. అనంతరం వరలక్ష్మి వేడుకలు నిర్వహించి కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీరెడ్డి, రామలింగేశ్వర్, రాధాకష్ణమూర్తి, పిఆర్ఎస్ ప్రసాద్ రావు, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందన కార్యక్రమంపై ఆడిట్

ప్రజాశక్తి - పగిడ్యాల

స్పందన కార్యక్రమంపై ఆడిట్ కమిటీ సభ్యులు ఎంపీడీవో వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ మురళీమోహన్, ఎస్సై నాగార్జున, ఎంఇఓ సుభాన్ ,వైద్య అధికారి అనిల్ కుమార్, ఆర్‌డబ్ల్యు ఎస్ఎఇ శివకుమార్, ఇఓఆర్‌డి నాగేంద్రయ్య శుక్రవారం సమావేశం నిర్వహిం చారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిష్కారం కానీ సమస్యలపై వారు దృష్టి సారించారు.


సమావేశంలో చర్చించుకుంటున్న అధికారులు

రామకృష్ణ కళాశాలలో పారిశ్రామిక డే

ప్రజాశక్తి - నంద్యాల


మాట్లాడుతున్న రాజ మహేంద్రనాథ్

స్థానిక శ్రీ రామకష్ణ డిగ్రీ, పీజీ కళాశాల నందు శుక్రవారం ప్రపంచ పారిశ్రామిక వేత్తల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్య్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి, కళాశాల డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి, ముఖ్య అతిథిగా పారిశ్రామిక రాష్ట్ర స్థాయి, బ్యాంకు రాష్ట్ర స్థాయి సభ్యుడు, ఏపీఐఐసీ రాష్ట్ర స్థాయి సభ్యుడు కె. రాజ మహేంద్రనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ మహేంద్రనాథ్ మాట్లాడుతూ ఎగుమతులు – దిగుమతులు, వ్యవసాయం, వ్యాపార పద్ధతుల గురించి తెలిపారు. కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ మన కళాశాలలోనే మహేంద్రనాథ్ చదివి ముఖ్య అతిథిగా రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27 నుండి నిజరూప దర్శనం

ప్రజాశక్తి - మహానంది

ఈనెల 27న ఆదివారం శ్రావణ శుద్ధ ఏకాదశి నుండి మహానంది పుణ్యక్షేత్రంలో మహానందీశ్వరుని నిజరూప దర్శనం నిరంతరాయంగా కొనసాగించేవిధంగా చర్యలు తీసుకున్నట్లు ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, పాలక మండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డిలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. ఆదివారం నుంచి క్షేత్రంలో లడ్డు, పులిహోరలతో పాటు వడ ప్రసాదమును భక్తులకు అందుబాటులోకి వస్తాయన్నారు.

29న జిల్లా చెస్ పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 29వ తేదీ ఉదయం 9 గంటల నుండి రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకాన ంద ఆడిటోరియంలో జిల్లాస్థాయి ఓపెన్ చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రవికృష్ణ, రామసుబ్బారెడ్డి తెలిపారు. 12 రకాల వివిధ వయసు కేటగిరీలలో ఈ పోటీలు నిర్వహిస్తా మన్నారు. వివరాల కోసం ఫోన్ నెంబర్ 9010451585 ద్వారా సంప్రదించాలని కోరారు.

వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా బంగారం మౌలాలి

ప్రజాశక్తి - పాములపాడు



వైసిపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాములపాడు మండలం ఇస్కాల గ్రామానికి చెందిన బంగారు మౌలాలి నియామకం అయ్యారు. మండలంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా ఎం నాగరాజు, పీరయ్యలు నియామకం అయ్యారు. బంగారు మౌలాలి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీగా శ్రీనాథ్ పెరుమాళ్ళ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్



నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కోట)లో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ పెరుమాళ్ళ నంద్యాల జిల్లా నూతన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14/17 సెక్రటరీగా నియమించబడ్డారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖాధికారి సుధాకర్ రెడ్డి నుండి ఆదేశాలు వెలువడ్డాయి. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యా యుల సహాకారంతో, ఐక్యమత్యంగా స్కూల్ గేమ్స్ విజయవంతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. శ్రీనాథ్ నియామకం పట్ల ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర గౌరవ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు నిమ్మకాయల సుధాకర్, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఏ.పీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్కే కరిముల్లా బాష, వైస్ ప్రెసిడెంట్ కళ్యాణ్ రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్, నంద్యాల జిల్లా శాప్ కో–ఆర్డినేటర్ రవికుమార్, నంద్యాల జిల్లా సంఘం చైర్మన్ పి. షేక్షావలి రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ట్రెజరర్ భుజంగ రావు , జిల్లా హెడ్ క్వార్టర్ సెక్రెటరీ సురేష్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపి నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు


ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలో వెంకటేశ్వర స్వామి గుడి ఆవరణలో సంపూర్ణ వర్షం రావాలని కోరుకుంటూ సమాజం రైతన్నలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షతో శుక్రవారం గీతాయోగాసన సంఘం మిత్రులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని గుడిచుట్టూ అంగప్రదక్షిణ, పోర్లు దండాలు చేశారు. గీతా యోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య మాట్లాడుతూ వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని, సమాజం అంతా ఆనందంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 80 మంది పైగా సభ్యులు పాల్గొపాల్గొన్నారు. సీనియర్ న్యాయవాది నాగభూషణం రెడ్డి, యశ్వంత్, సముద్రాల బాబు, మీసేవ శ్రీరాములు, రంగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


డోన్‌లో..

వర్షం కురవాలని ముస్లింల ప్రార్థనలు

ప్యాపిలి : అన్ని రాష్ట్రాల్లో, జిల్లాల్లో వర్షాలు ఒక మోస్తరుగా పడుతున్నప్పటికీ ఆగస్టు మాసం ఆరంభమై మూడు వారాలు కావస్తున్నా వర్షాలు కురవకపోవడంతో ప్యాపిలి ముస్లింలు బాలికల ఉన్నత పాఠశాల లో ప్రార్థనలు చేశారు. శుక్రవారం జామియా మసీదు, మౌలానా మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటికి సైతం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. వర్షాలు పడితే చెరువులో నిండుతాయన్నారు. చెరువులు నిండితే భూగర్భ జలాలు స్థిరంగా ఉంటాయన్నారు. జామియా మస్జీద్, గంజిఖానా మస్జీద్, షాదీఖానా మస్జీద్,మదీనా హఫ్సమస్జీద్ ముస్లింలు పాల్గొన్నారు.


ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

విజయ డెయిరి పాడి రైతులకు బోనస్ పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపిపి,డిప్యూటీ డైరెక్టర్

ప్రజాశక్తి - చాగలమర్రి

విజయ డెయిరి పరధిలోని నాలుగు జిల్లాల్లో ఈ ఏడాది పాడి రైతులకు రూ. 14 కోట్ల బోనస్ పంపిణీ చేసినట్లు విజయ డెయిరి డిప్యూటీ డైరెక్టరు రాజేష్ పేర్కొన్నారు. మండలంలోని తోడేండ్లపల్లె గ్రామంలో విజయ డెయిరి పాడి రైతులకు బోనస్,సబ్సిడీ ఎంపిపి రామిశెట్టి వీరభద్రుడు,డిప్యూటీ డైరెక్టరు రాజేష్ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021లో ప్రతి లీటర్‌కు ఒక్క రూపాయి బోనస్ ఉండేదని,ఈ ఏడాది చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి దానిని రూ.3లకు పెంచడం జరిగిందన్నారు. రైతులు గేదెలు కొనుగోలు చేస్తే కొనుగోలు ధరలో 20 శాతం సబ్సిడీ రూపంలో అందజేస్తామన్నారు. రైతులు పశుగ్రాసాన్ని సాగు చేస్తే ఎకరాకు రూ5 వేలు చొప్పున అందజేస్తామన్నారు. పాడి రైతు ఇంట్లో వివాహ కార్యక్రమం ఉంటే కళ్యాణమస్తు కింద రూ. 5 వేలు, ఒక వేళ రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే క్షీరబంధు కింద రూ. 50 వేలు బీమా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమ ంలో సర్పంచ్ గోవిందయ్య,సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాసులు, మేనేజర్ పద్మయ్య,సూపర్‌వైజర్ ఆనంద్,ఏజంట్ ఆలమూరు దస్తగిరి పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అనేక అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసీపీ పాలనలో నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలుకూరు గ్రామం కొత్తపేట కాలనీలో గంగన్న బోయిన రంగమ్మ ఇంటి నుండి గుండ్ల సింగవరం వెంకటేశ్వర్లు వరకు గడప గడప నిధుల క్రింద సిమెంట్ రోడ్డు నిర్మాణం కొరకు వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గుండంశేషి రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసిపికి ప్రజలు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాటసాని రామిరెడ్డిని మరల ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో తిమ్మాపురం వైసిపి నాయకులు అల్లే సురేష్ రెడ్డి, పలుకూరు సర్పంచ్ కోనేటి సుమలత, ఉపసర్పంచ్ కే. శివకృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దస్తగిరి, సచివాల య కన్వీనర్ వడ్డే వెంకటేష్, సురేష్, జాను, సురేం ద్ర గౌడ్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి

వైసిపి విజయాన్ని అడ్డుకోలేరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చంద్రబాబు నాయుడు, లోకేష్ రాష్ట్రంలో ఎటువంటి యాత్రలు చేసినా.. వైసిపి విజయాన్ని అడ్డుకోలేరని, నంద్యాలలోనూ తమదే విజయం ఖాయమని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం నంద్యాల పట్టణం ప్రథమనందీశ్వరస్వామి దేవస్థానం ఆవరణం లోని డా.వైఎస్సార్ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన జేవీఎస్ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, రాష్ట్ర మార్కెఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకెళ్లి పార్టీ భలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రత్యేకంగా జేసీఎస్ నమోదు కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి రూ.10లక్షల బీమా చేయడం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కష్టపడాలని విజయానికి కషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు విజయశేఖర్రెడ్డి, సాయిరాంరెడ్డి, దాల్మిల్ అమీర్, బసవేశ్వరరెడ్డి, తదితర నాయకులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

వసుధ ఫౌండేషన్ సేవలు అభినందనీయం : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

వసుధ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణానికి చెందిన రెండు ఆర్యవైశ్య కుటుంబాల వారు ఆర్థికంగా వెనుకబడి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరు శ్రీనయ్య వసుధ ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ఒక్కో కుటుంబానికి రూ. 10 వేల చొప్పున మొత్తం రూ. 20 వేలు ఆర్థిక సాయం మంజూరు చేశారు. టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి చేతుల మీదుగా శేష ప్రసాద్ కుటుంబానికి రూ .10,000, గోట్ల శ్రీకాంత్ కుటుంబానికి రూ.10000 ల చొప్పున మొత్తం రూ . 20 వేల రూపాయలను పంపిణీ చేశారు. యనకండ్ల గ్రామానికి చెందిన చాంద్ బాషాకు సంబంధించి ముగ్గురు పిల్లలు అంగవైకల్యంతో బాధపడుతునడంతో.. సమస్యను వసుధ ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లగా ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున ప్రతినెల రూ.3 వేల ప్రకారం జీవితాంతం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన మంతెన వెంకటరామరాజు వసుధ ఫౌండేషన్ ఏర్పాటు చేసి గత 15 ఏళ్ల నుంచి ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారని తెలిపారు. కరోనా సమయంలో వేలాది కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడమే కాకుండా నిత్యావసర సరుకులు పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారన్నారు. స్థానికంగా టంగుటూరు శ్రీనయ్య, ఆయన మిత్రబృందం నిరుపేదలను గుర్తించి వసుధ ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లి మంజూరు కృషి చేస్తున్నారని వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జంగంశెట్టి, భరతుడు, మల్లారెడ్డి, నాగరాజు, కృష్ణనాయక్, నరసింహారెడ్డి , విష్ణువర్ధన్ రెడ్డి ఖాదర్, నాగిరెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న బీసీ రాజారెడ్డి

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుపై వాగ్వివాదం

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో ఎస్సీ కాలనీ సమీపాన, వీరముసలయ్య గుడి సమీపంలో కల్వర్టుపై అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుపై వివాదం నెలకొంది. ఎస్సీలు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పూనుకునగా.. కొందరు బీసీలు వాల్మీకి నగరాని బోర్డు రాత్రికి రాత్రి ఏర్పాటు చేశారు. దీంతో ఎస్సీలకు బీసీల మధ్య గురువారం రాత్రి వాగ్వాదం చేసుకుంటూ ఘర్షణ వాతావరణం నెలకొంది. వీరముసలయ్య గుడికి సంబంధించిన స్థలములో అంబేద్కర్ విగ్రహం ఎలా ఏర్పాటు చేస్తారని, బస్టాండ్‌లో ఏర్పాటు చేసుకోవాలని బీసీలు పేర్కొనగా.. ఎస్సీ కాలనీ సమీపాన కల్వర్టుపై ఏర్పాటు చేసుకుంటే ఎవరికి అడ్డంకి ఉండదు కదా అని ఎస్సీలు చెప్పడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. కేవలం ఒక మీటర్ స్థలంలోనే అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటుంటే దానికి ఇంత రాజకీయాలు చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ముచ్చుమర్రి ఎస్సై నాగార్జున సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాల వారికి నచ్చజెప్పి వాల్మీకి నగర్ బోర్డుని తీసేపించారు. రెవెన్యూ అధికారులకు విషయాన్ని చెప్పి స్థలాన్ని కొలతలు వేయించి సమస్యను పరిష్కరిస్తామని ఎస్సై చెప్పడంతో సమస్య సద్దుమరిగింది. ఘర్షణలకు దిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. గ్రామాలలో చిన్న చిన్న విషయాలకు ఘర్షణలు చేసుకొని ప్రశాంతతను కోల్పోవద్దని ఎస్ఐ గ్రామస్తులకు సూచించారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు

మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో ఎస్సీ , వాల్మీకుల గురువారం రాత్రి జరిగిన ఘర్షణ సంఘటన స్థలాన్ని ఎంపీడీవో వెంకట రమణ, ఎస్సై నాగార్జున, డిప్యూటీ తహశీల్దార్ మురళీమోహన్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఇరు వర్గాల వారిని పగిడ్యాల ఎంపీటీవో కార్యాలయానికి పిలిపించి వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ ంగా అధికారులు మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే సామ్రాస్యంగా పరిష్కరించుకోవాలని ఘర్షణలకు దిగారాదన్నారు. అనవసరమైన ఘర్షణ లు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని వారికి అధికారులు సూచిం చారు. ఇరువర్గాలతో వారి సమస్యల వినతిపత్రాలని స్వీకరించామని వారు తెలిపారు ఇరువర్గాల పై బైండవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జున తెలిపారు. ఇఓఆర్‌డి నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటను దున్నేసిన రైతు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే రైతు తాను సాగు చేసిన 2ఎకరాల్లోని బొప్పాయి పంటను శుక్రవారం ట్రాక్టరుతో దున్నేశారు. గత సంవత్సరం రైతు రెండెకరాల్లో బొప్పాయిని సాగు చేశారు. పంట సాగు చేసినప్పటి నుంచి వర్షాలు సరిగా పడక తెగులు బారిన పడింది. పంట దిగుబడి సరిగా రాకపోవడంతో రైతు పంటను ట్రాక్టరుతో దున్నేశారు. రైతుకు దాదాపు రూ. రెండు లక్షల దాకా నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యకం చేసారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతు కోరారు.



మహారాజశ్రీ ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 124/2018 in O.S 38/2016

B.నసురుల్లా ఖాన్. ...అర్జీదారు/ డిక్రీహోల్డర్

V/S

పింజరి మౌలాలి అలియాస్ మౌలాలి.

...రేస్పాండెంట్/జె.డి.అర్

వేలం ప్రకటన

పైన కనపరచిన డిక్రీ హోల్డర్ కు జె. డి. ఆర్ నుండి రావలసిన ఇ.పి సొమ్మును రాబట్టు కొనుటకు ఈ క్రింద కనపరచిన ఇ.పి షెడ్యుల్ దాఖలు అస్తిని 11-09-2023 ఉదయం 10-30 ని. హైకోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. కావున కొనవలసినవారు ఎవరైనా బహిరంగ వేలంలో పాల్గొనవచ్చు.

షెడ్యులు : - నంద్యాల జిల్లా, నంద్యాల డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ బండి ఆత్మకూరు సబ్-రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, వెలుగోడు రెవెన్యు మండలము, వెలుగోడు రెవెన్యు గ్రామ పరిదిలో గల జే.డి.ఆర్ యొక్క ఆస్తి వివరాలు.

సర్వే నెంబరు:-116

విస్తీర్ణము : 0.02.250 (రెండు పావు) సెంట్స్

చేని పేరు: కోట వెంకట చేను.

డి.హెచ్.ఆర్ విలువ - 1,50,000

అమీన విలువ : 30 లక్షులు

చెక్కుబంది.:-

తూర్పున :- అమరావతి మోహన కుమార్ మంగళము మరియు బ్రదర్స్ ఇప్పుడు వుశని పీరా ఇండ్లు.

పడమర :- మినిల్లా అలియాస్ మల్లన్న ఇప్పుడు కాలి స్థలం ఇస్మాయిల్

ఉత్తరం: పుల్లయ్య ఆచారి భూమి ఇప్పుడు కాలి స్థలం జి.చాంద్ బాష

దక్షిణం: 15 అడుగుల రస్తా .

Note: పై ఆస్థి పై B. Nasurullakhan వారికి ఉండబడిన అయికము మొత్తం లోబడి వేలం వేయబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : - 11-09-2023

కే.లక్ష్మి నారాయణ,బి కాం., బి ఎల్

అర్జీదారు న్యాయవాది ఆత్మకూరు, నంద్యాల జిల్లా.

సెల్ నెం : 9440226537